ఈ వారం కథ!

# వేసుకొలిన వాసన

## –ఎ.ఎన్. జగన్నాథ శర్మ

జల్లు కురిసి వెలిసింది. వాతావరణమంతా తడితడిగా, చలిచలిగా వుంది. ఈ క్షణమో, మరు క్షణమో మళ్ళీ చినుకు పుంజుకునేటట్టుంది. పదిన్నరయినా పాసింజరు బండి రాలేదు.

ఆకలిగా వుంది. అసహనంగా వుంది. దీప స్తంభాన్ని అంటి పెట్టుకుని వున్న వందలాది రెక్కల పురుగులు, నేల మీదికి దూసుకొచ్చి, ఆత్మత్యాగాలు చేసుకుంటుంటే జాలిగా వుంది.

తురాయి చెట్టు నీడన నిల్చుని వున్నాను. గాలి కెరటం కదిలినప్పుడల్లా కొమ్మలు కలవరపడుతున్నాయి. అదుముకున్న నీటిని ఆకుల వేళ్ళ సందుల నుండీ జార విడుచుకుంటున్నాయి. శిరసున చినుకులు చిట్లుతున్నాయి. శరీరమంతా జలదరిస్తోంది.

పట్టాలకి అటుగా నిలిచిన జట్కా, చీకటి సముద్రంలో చిరునావలా వుంది. గుర్రం తల విదిలిచ్చినప్పుడల్లా, దాని మెడనున్న మువ్వల పేరు కదిలి, శబ్ద తరంగాలు చెవులను స్పృశించి, చెదిరిపోతున్నాయి.

సరదాపడి కొన్న మువ్వలవి. తొలి రోజుల్లో సంగీత స్వరాలను విన్పించేవి. ఇప్పుడు ఉత్త ధ్వనిని మాత్రమే విన్పించగలుగుతున్నాయి. చేతినున్న హరికెన్ లాంతరు మీద చినుకుపడి చిలికిపోయింది. పురుగుల బాధ పడలేక, చిమ్నీ చుట్టూ ఆకు చుట్టానేమో, వేడికి మరణయాతనతో వెల్లకిలా విరుచుకుని, ఉమ్మలు చుట్టుకు పోతోందది.

రైలొస్తున్నట్టుంది. పట్టాలు పలుకుతు న్నాయి. చెట్టు నీడను వదిలి వచ్చాను. కనుచూపు మేర కాంతి పుంజం కన్పించింది. వచ్చి నిలిచిన బండిలో నుంచి, ఆ ఆరుగురూ కిరాణాకొట్టు శెట్టి, మేస్త్రీమ్మ, పోలీసు, జబ్బు మనిషి గురుమూర్తి, కాలేజీ కుర్రోడు, టైపు నేర్చుకుంటోన్న అమ్మాయీ దిగారు. గుంపుగా చేరి, నా కోసం వెతుక్కొంటున్నారు.

ఇళ్ళకి చేరాలని వాళ్ళకెంత ఆత్రంగా వుందో, నేనూ అంతగానే ఆత్ర పడుతున్నాను. ఆ దేహాలను ఆయా ప్రాంతాల్లో జారవిడిచేసి, చేతులు దులుపుకోవాలని వుంది.

వాళ్ళు జట్కా దగ్గరికి దౌడు తీశారు. వాళ్ళ వెనుగ్గా నడిచాన్నేను.

సన్నగా వర్షం మొదలయింది.

అంతా ఒకరి మీద ఒకరుగా జట్కా మధ్యలో ముడుచుక్కూర్చున్నారు. లాంతర్ని వేలాడదీసి,! నేనూ జట్కా నెక్కాను. గుర్రం నడకలు పోయింది. వర్షం పుంజుకుంది.

ఊరికి దూరంగా నాలుగుమైళ్ళివతల వుందీ రైల్వే స్టేషన్. స్టేషన్ వరకు ఊరు ఎదగలేదు. ఎదిగే అవకాశమూ లేదు. పది, పన్నెండిళ్ళతో చిన్న చిన్న గ్రామాలుగా వుందీ ప్రదేశం. కొండ ప్రాంతం కావడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో వుంది. పట్నం నుండి ఒకటి రెండు బస్సులువున్నాయిక్కడికి. అయితే వర్షాకాలంలో బస్సుల జాడ కనిపించదు. మైదానాల వరకూ పరుగెత్తుకొచ్చిన బస్సులు, కొండను చూసి, గుండెలు చరచుకుని, వెను తిరిగిపోతాయి. ఫలితంగా నావంటి జట్కావాలాలు బతకగలుగుతు న్నారు.

గత పదేళ్ళుగా ఈ రోడ్డుని చూస్తున్నాన్నేను. దీంతో ముచ్చట్లాడుతున్నాను. మురిపాలు పోతున్నాను. నాకు బాగా పరిచయమున్న రోడ్డిది! ఎక్కడ ఎత్తులున్నది, పల్లాలున్నదీ, గుంటలున్నదీ అన్నీ కంఠోపాఠం. జట్కా నడపడంలో మెలకువలు చూపించనవసరం లేదు. అప్రయత్నంగా, అసంకల్పితంగా బండి సజావుగా సాగిపోగలుగుతుంది. నాకంటే, నా గుర్రానికి ఈ రోడ్డంతా మరీ సుపరిచితం. చిన్ననాటి స్నేహితులివి!

వాలిపిరి కొడుతోంది. గాలివాటుకి జల్లు, జట్కా లోనికి తొంగి చూస్తోంది. ముందు కూర్చున్న మేస్త్రమ్మ, టైపు నేర్చుకుంటోన్న అమ్మాయీ తడిసి నట్టున్నారు.

''వెధవ్వాన'' అన్నది మేస్త్రమ్మ.

''చలి చలి'' అన్నది అమ్మాయి.

''ఇటు రా రాదా'' అన్నాడు మేస్త్రమ్మను ఉద్దేశించి కిరాణాకొట్టు శెట్టి. పోలీసు పగలబడి నవ్వాడు. గురుమూర్తి దగ్గాడు. కుర్రాడెందుకో మవునంగా వున్నాడు.

ఏడు గంటలకు రావాల్సిన పాసింజరు బండి, మూడున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ఈ ఆలస్యం, ఈ చీకటి, ఈ వర్షం శెట్టిని, పోలీసునీ సరదాలకు, సరసాలకూ ఉసి గొలుపుతోంటే, పాపం! ఆ మేస్త్రమ్మని, అమ్మాయిని, గురుమూర్తినీ బాధిస్తున్నట్టున్నాయి కుర్రాడి గుండె గుబులు నేనెరుగను! నా విషాద నేపథ్యం వీళ్ళెరుగరు!

ఉన్న ఊరు నుండి స్టేషన్‌కి, స్టేషన్ నుండి వున్న ఊరుకీ జట్కాలో దిగవిడిచినందుగ్గాను, వీళ్ళంతా –



**1989**

**'రంజని - నందివాడ భీమారావు అవార్డు' కథల పోటీలో ప్రథమ బహుమతి రూ. 1,116 అందుకున్న కథ**

నెలసరి కిరాయిగా యాభయి రూపాయల్ని ఒకొక్కరూ చెల్లిస్తారు. పైపై బేరాలు పోను, నెల తిరిగేసరికి చేతిలో రెండు వందల రూపాయిలు మాత్రమే పడతాయి. శెట్టీ, పోలీసూ పైసా ఇవ్వరు. పోలీసు బాబుని కిరాయి అడిగే ధైర్యం లేదు. కిరాయిని, వడ్డీ కింద శెట్టి జమ చేసుకుంటాడు.

రెండేళ్ళ క్రితం జట్కా బోల్తాపడింది. చక్రాలు విరిగిపోయాయి. గుర్రం కుంటిదయింది. అప్పుడు శెట్టిని ఆశ్రయిస్తే అయిదు వందల రూపాయిలు అప్పిచ్చాడు. అప్పిచ్చి ఆ నాడాదుకుని నేటికీ అసలు చెల్లించ లేని నా జీవితమ్మీద స్వారీ చేస్తున్నాడు.

పట్నం ఠాణాలో పోలీసు బాబు పని చేస్తాడు. పక్కనే శెట్టి కిరాయి దుకాణం. ఫర్లాంగు దూరంలో స్కూల్లో మేష్టమ్మ, కాలేజీలో కుర్రాడు, ఇన్‌స్టిట్యూట్‌లో టైపు నేర్చుకునే అమ్మాయి, ఆస్పత్రిలో రోజూ పరీక్ష చేసుకునే గురుమూర్తి - వీళ్ళంతా ప్రతిరోజూ పట్నాన్ని పలకరించి, పరామర్శించి రాక తప్పదు. సెలవు దినాల్లో ఒకరిద్దరు తక్కువయినా, మిగిలిన వాళ్ళ కోసం నా వృత్తికి సెలవంటూ దొరకదు.

బురద గుంటలో చక్రం పడింది. జట్కా తూలి పడి నిలిచింది. గుర్రం, శక్తినంతా కూడదీసుకుని లాగుతోన్నా ఫలితం లేదు. తప్పదనిపించింది. కుర్రాణ్ణీ, పోలీసుని, శెట్టినీ జట్కాను నెట్టేందుకు కిందికి దిగమన్నాను. నలుగురమూ సాయం పడితేనేగాని జట్కా పైకి లేవదు.

ఇది మామూలే! వర్షాకాలంలో, దారిలో ఇటువంటి అడ్డంకులు తప్పనిసరవుతాయి.

"కావాలంటే అప్పిస్తాను! బండికి మోటారు పెట్టించరాదురా" అన్నాడు శెట్టి.

"అవున్నిజం" అన్నాడు పోలీసు. ఆ మాటలకి బతుకు భయం కలిగిందేమో! గుర్రం వణికింది. ఒక్కసారిగా శరీరాన్ని విదిల్చింది. జట్కా ఓ అడుగు ముందుకి నడిచి, నిలిచింది.

చేతినంటిన మట్టిని, జట్కా అద్దాలకు పూసి, వాళ్ళు జట్కా నెక్కితే, మట్టి వాసనను వదల్చుకోదలచక, నేనదే చేతుల్తో కళ్ళాన్ని అందుకున్నాను. లేచింది మొదలు పడుకునే వరకూ ఇదే మట్టిలో పరుగెడతాను. దీన్ని కాదనుకునేవాణ్ణి కాదు. కాదనుకుంటే పుట్టగతులుండవు.

"దెయ్యాల వేళక్కాని ఇళ్ళకి చేరమేమో" అన్నాడు శెట్టి.

"మీరన్నది నిజం! పన్నెండు గ్యారంటీ" అన్నాడు పోలీసు.

"మీరయితే రేపు మేష్టమ్మ స్కూలుకి రాదు" అన్నాడు శెట్టి.

"ఆవిడ సంగతేమోగాని, గురుమూర్తి మాత్రం రేపు ఆసుపత్రికి రాడు" అన్నాడు పోలీసు. ఆ మాటకి కితకితలు పెట్టినట్టుగా నవ్వాడు శెట్టి.

గురుమూర్తి చావు మీద సరస సంభాషణ సాగుతోంది. వస్తోన్న దగ్గునణచుకుని ఉక్కిరి బిక్కిరవుతున్నాడు గురుమూర్తి. తన ప్రాణంతో పరాచికాలాడడాన్ని అతను భరించలేకున్నాడు.

గాలివాటు తగ్గింది. వర్షం నిలిచి కురుస్తోంది. కాలవలు కట్టి, నీరు రొదగా ప్రవహిస్తోంది.

ఈసరికి, గుడిసె నిండుగా నీరు నిలిచి వుండి వుంటుంది. గిన్నెలు, బట్టలూ తేలిపోయుంటాయి. అన్నం గిన్నె గిరికీలు కొడుతూ వుంటుంది. పల్లంలో వున్న గుడిసె మీద తల్లి గంగకి ఎల్లలేని ప్రేమ మరి!

ఆకలిని అణగార్చుకున్నా, అలుపును మరచి పోయేందుకు, గాఢంగా నిద్రించేందుక్కూడ అవకాశం లేదు. ఏటవాలుగా నిలిచిన జట్కాలోనే, జారుడు బల్ల మీది వాటంలా విశ్రాంతిని ఆశించాలి.

అత్తమ్మ వుంటే గుడిసెలోని నీటిని తోడి పారేసేది. ఏ వేళనయినా మంచు ముద్దలా పిడికెడు అన్నాన్ని కంచంలో నుంచేది. మామయ్య చనిపోవడంతో అత్తమ్మ లేకపోయింది. పట్టెడన్నం కోసం, శరీరాన్ని ఎర జూపుతూ పిచ్చితల్లి లేచిపోవాల్సి వచ్చింది. ఎవర్ని అల్లుకుని, ఎక్కడ ఆకలిని తీర్చుకొంటోందో ఏమో!

రాయి మీంచి చక్రం నడిచినట్టుంది. జట్కా తూలిపడి నిలదొక్కుకుంది. అంతా ఒక్కసారిగా అరిచి సద్దుమణిగారు.

"కళ్ళు మూసుకున్నావేట్రా బాబూ" అడిగాడు శెట్టి.


"లేదు! రోడ్డు మాసుకు పోయింది" అన్నాను జవాబుగా.

"జాగ్రత్తరా బాబూ! రేపు మినిస్టరుగారొస్తున్నారు. బందోబస్తుకెళ్ళాలి" అన్నాడు పోలీసు.

అతనికి బదులు పలుకలేదు. అసలా పోలీసుతో మాట్లాడాలంటేనే అసహ్యం! అతను చనిపోతే బాగుణ్ణనుకుంటాను. పట్నంలో ఏదో ఒక దొమ్మీలో ఎవరో ఒకరు పోలీసుని చంపినట్టు వార్త రాకూడదూ? అనిపిస్తుంది. అతని మీద ఎందుకనో అలవి మాలిన కసి!

గురుమూర్తి పెద్దగా ఆయాసపడుతున్నాడు. బుసలు కొడుతున్నాడు. చచ్చిపోతాడేమో! అతగాడి శవాన్ని, ఇంటికి అప్పజెబుతాననిపించింది.

శెట్టిని హత్య చేయాలని వుంది. మేష్టమ్మను తిట్టి



పోయాలని వుంది. టైపు నేర్చుకుంటోన్న అమ్మాయిని తన్ని ఇంట్లో కూర్చోబెట్టాలని వుంది. కాలేజీ కుర్రాడి మీద కోపగించుకోవాలని వుంది. ఎందుకు? ఎందుకంటే జవాబు లేదు. ఈ ముఖాల్ని చూస్తూసి, వీటితో విసిగిపోయుంటాము. బతుకులో కొత్తదనం లేదనిపించడం కూడా ఈ ఆవేశానికి, అసహనానికీ కారణం కావచ్చును.

మొహం మొత్తేటట్టు జీవించడం ఇష్టం లేక పోతోంది. ఏదో కావాలనిపిస్తోంది.

ఈ అనుభవం నాకు కొత్తది కాదు. ఈ బాధ సరికొత్తది కాదు. బుద్దెరిగిన నాటి నుంచి నేనిలాగే ఆలోచనలు పోతున్నాను.

అప్పుడూ అంతే! ఇప్పుడూ ఇంతే!


అమ్మను ఆట పట్టించిన రోజుల్ని, నాన్నతో దోబూచులాడిన వేళల్ని, అక్కను గిల్లి అల్లరి చేసిన సంఘటనల్నీ తలచుకుంటుంటే, ఈ నాడవి, అందంగా వుండి అందరాని అనుభూతులనిపించినా ఒకనాడవి రోత పుట్టించాయి. భయాన్ని కలిగించాయి. పరిస్థితుల నుండి, పల్లెపట్టు నుండి పారిపోయేటట్టు చేశాయి.

నా బాల్యం, నన్ను నానా రకాలుగా హింసించింది. నన్ను ముక్క ముక్కలు చేసింది. నన్నెదగనీయలేదది. కళ్ళకి కలలు ముసుగేసి నన్ను నా నుండి కనుమరుగు జేసింది.

నాన్న క్రర మిల్లులో పనిచేసేవాడు. 'కటర్'గా వృత్తిని నిర్వహించేవాడు. నిక్కరు, బనియను ధరించి, తోలు పట్టానొకదాన్ని గుండెల మీద కవచంలా వుంచుకుని పెద్ద పెద్ద దుంగల్ని చీల్చి చెండాడేవాడు.

క్రరను కోసేవేళ రంపపు ధ్వని 'అమ్మకి దండం! నాన్నకి గండం' అని వల్లె వేసేది. మనసులో ఆ మాటల్ని ఉచ్చరిస్తే చాలు! పాటయ్యేదది. ఆ పాటలతో దుంగల మీంచి దూకుతూ ఆటలాడుకునేవాణ్ణి. జారిపోతున్న నిక్కర్ని ఎగదోసుకుంటూ, జబ్బాను సర్దుకొంటూ జులాయిగా వుండేవాణ్ణి.

అమ్మ, క్రర పొట్టును గోనె సంచుల్లో నింపుతోండేది. సంచిలో పొట్టును కుక్కి కుక్కి నింపడంలో నా సహాయాన్ని అర్థించేది.




"మీ ఆయన నిన్నెందుకు వదిలేశాడు?"

"సినిమా నుంచి ఒంటరిగా తిరిగి వస్తుంటే ఒక రౌడీ వెంబడించాడు.

వాడి నుంచి రక్షించుకోవటానికి... ఆ పక్కనే వున్న పోలీసు స్టేషన్‌లోకి వెళ్ళాను.

వాళ్ళు నన్ను ఓ గంట తరవాత జీపులో ఇంటి దగ్గర దిగబెట్టారు...!"

—వకురా., తెనాలి

"ఆ గెంతులేవో, ఈ గోనె సంచి మీద గెంత రాదురా" అనేది. బతిమలాడేది. అందక పరుగెత్తే నన్ను అంది పుచ్చుకుని, పొట్టు గుట్ట మీదకి లాక్కొచ్చేది. జల్లులా కురుస్తోన్న పొట్టులో పొర్లి పొర్లి, మనిషంతా పొట్టుమయమయిన తర్వాత 'పగటి వేషగాడిలా వున్నావు' అన్న కితాబు లభిస్తే అమ్మనప్పుడు ఆదుకునే వాణ్ణి. బుగ్గల్ని పొంగించి హనుమంతుణ్ణనుకుని పొట్టు బస్తాపై చిందులేసేవాణ్ణి. అలా నింపిన పొట్టు బస్తాకి అమ్మకి పావలా లభించేది. అందుకోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆమె వర్తించడాన్ని చూసే వాణ్ణి. బడివేళ వరకు అమ్మకి అండగా వుండి, ఆ తర్వాత నేను బడికి పయనమయితే, అమ్మెక్కర్రీ ఆకాశాన్ని అందుకోవాలన్నట్టుగా ఎగిరి గంతులేసేది. తోడుగా అక్కను మాత్రం రమ్మనమనేది కాదు. అక్క గంతులేయడాన్ని, అక్కడంతా ఆత్రంగా మాడడాన్ని గమనించి నాన్న వద్దన్నాడు.

అక్క, దుంగల మీది బెరళ్ళను తీసి తట్టలో వేసుకునేది. మంచుకి, వర్షానికి తడిసిన దుంగల మీది బెరళ్ళను తీయడంలో అక్క ఎంతగానో శ్రమించేది. గోళ్ళలో పేళ్ళు గుచ్చుకున్నా ఖాతరు చేసేది కాదు. ఒకొక్కప్పుడు బెరళ్ళ నడుమ జెర్రలను, తేళ్ళనూ చూసి, బెంబేలు పడి రక్షణగా నన్ను కేకేసేది. వీముల్ని చంపినట్టుగా నేను వాటిని చంపుతోంటే, చేయిజాచి, నన్ను దగ్గరగా తీసుకునేదక్క. మెచ్చుకోలుగా నా జుత్తు నిమిరేది. తోడుంటానని బడికి వెళ్ళవని మొరాయిస్తే "వెళ్ళిరారా" అని ప్రాధేయపడేది.

ఇంట్లో, ఎక్కాలు పద్యాలూ పెద్ద గొంతుతో చదువుతోంటే, అమ్మ పొంగిపోయేది. "ఆరు పావలాలు ఎంతరా" అనడిగేది. రూపాయిన్నర" అని చెబితే, నాటి తన సంపాదనను చూసి చిన్న బుచ్చుకునేది. "దేనికి సరిపోతుందిది" అని దుఃఖించేది. "వళ్ళంతా పచ్చి పుండుగా వుంది! కడుపు నిండా గంజి తాగి కునుకు తీద్దామంటే నా సంపాదన నాకే చాలదు" అని నెత్తి కొట్టుకునేది. "ఇందులో పిల్లలకేం పెడతాను! పెనిమిటికేం పెడతాను" అని శోకించేది.

అక్క సంపాదనంతా అణాపైసల్లో వుండేది. నాన్న కష్టం ఆయన కల్లు ముక్కలకి పోయేది.

తాగొచ్చిన నాన్నతో, అమ్మ తగవులాడేది. "ఇలా గయితే ఎలాగయ్యా" అని ఆయన్ని నిలదీసేది. అమ్మ ప్రశ్నకి, నాన్నకి జవాబు తెలియదుగాని, జబర్దస్తీ తెలుసు! ఫలితంగా అమ్మను చితక తన్నేవాడాయన.

"మళ్ళీ పొరేత్తితే నరికి పోగులు పెడతాను" అనే వాడు. నన్ను దగ్గరగా తీసుకుని హరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను పద్యాలను చదివించుకుని వల్లబడేవాడు.

రంపానికి దుంగనందించడంలో ఓసారి ప్రమాదవశాత్తూ నాన్న వేలివేలు చీలిపోయింది. కుడిచేతి బొటనవేలు విరిగిపోయింది. చేపలా కిందపడి పొట్టు పొలయిందది. 'గొల్లు'మన్నారంతా. స్రవిస్తోన్న నాన్న రక్తాన్ని చూసి తల్లడిల్లిపోయారు. మిల్లు యజమానిని కేకేసి వివరించారు.

"ఎక్కడ చూస్తున్నావురా" అని నాన్నని కోపగించుకున్నాడాయన. యాభయి రూపాయల నోటిచ్చాడు.


"ఆస్పత్రిలో చావు" అన్నాడు. పాతిక రూపాయల మందులు తిని, నాన్న చేయి రక్తాన్ని దిగమింగుకుంటే మిగిలిన డబ్బుతో బాధను దిగమింగుకునేందుకు నాన్న



## 'ఒకే కాన్పులో ఆరుగురు'

'సూపర్ మమ్మీ స్పేరోల్‌మన్'కు 50 ఏళ్ళ క్రితం ఓ పాప పుట్టింది. పేరు సాండ్రా. రెండేళ్ళ క్రితం రెండో కాన్పులో ఒకేసారి ఆమె ఆరుగురిని కని రికార్డు సృష్టించింది-గెరీ, డూన్నా, నిరోల్, పేన్, క్టు ఆర్ట్, ఫేవ్స్, సూపర్ మమ్మీకి ప్రతి బిడ్డా పంచప్రాణమే. అయితే అందరూ ఒకేసారి ఎత్తుకొమ్మని మారాంచేస్తే ఆమె కెంతో ఇబ్బంది కల్గుతుంది. లండన్‌లోని పోలీసు డిపార్టుమెంటులో ఉద్యోగంచేస్తున్న ఆమెభర్త ఆర్థర్, ఈ షట్కోణీయ తుఫాను రాగానే ప్రస్తుతం నివసిస్తున్న మూడు గదుల యింటికి గుడ్‌బై చెప్పి ఆరు గదుల యింటికి కాపురం మార్చారు.

— నల్లబెల్ల రంగయ్య



రాజు, రమేష్ అనే ఇద్దరు స్నేహితులు సినిమా చూసి రాత్రి 10 గంటలకు ఇంటికి నడచివస్తుండగా 'బాబోయ్... బాబోయ్... రక్షించండి, రక్షించండి' అని అరుపులు వినిపించినాయి. ఆ అరుపులకు భయపడి రాజు పరుగులంకించాడు.

రమేష్ : ఏరా రాజు, ఎందుకురా అలా పరుగెడు తున్నావు?

రాజు: ఊళ్ళోకి వెళ్ళి మగాళ్ళను తీసుకురావడానికి.

—పి.వి. రాంబాబు, విజయవాడ.

కళ్ళు పోకని ఆశ్రయించాడు. వారం రోజుల పాటు పనిలోనికి పోలేదాయన. కుడిచేతిని కళ్ళ ముందుంచు కుని విలపించాడు. యజమాని మళ్ళీ పనిలోనికి తీసుకోడేమోనని దిగులు చెందాడు. అయితే నాన్నని ఓదారుస్తూ-

"నాకు పని ముఖ్యంరా! నీ వేలు కాదు" అని యజమాని అనడంతో నాన్న ఆనందానికి ఆనాడు పట్టపగ్గాలు లేకపోయాయి. బొటన వేలు మొలకెత్తి నంతగా సంతోషించాడు. "మీరు 'దేవుడు బాబూ" అన్నాడు. యజమానికి పడి పడి నమస్కరించాడు. నాలుగు వేళ్ళూ నోటికి పోనున్నాయన్న ధీమాతో రెట్టించి పని చేశాడు.

నాటి నుంచే అమ్మ దగ్గడం ప్రారంభించింది. దగ్గి దగ్గి, గుండెలు తోడేసినట్టు గిలగిలా కొట్టుకునేది. కెళ్ళలు కెళ్ళలుగా కఫాన్ని కక్కుతో కుళ్ళిపోయేది. రోజుకి ఆరేడు బస్తాల్లో పొట్టును కూరగలిగే అమ్మ, రెండు మూడు బస్తాల్లో మాత్రమే కూరగిలి, ఢీలా చెందేది. చేతిలో రూపాయి కూడా పడని తన శ్రమని చెడ తిట్టుకునేది. బడికిపోనని బస్తాల్లో పొట్టు కూరు తానని మొండికేసే నన్ను తిట్టి, కొట్టి బడికి సాగ నంపేది.

బడి వదిలిన తర్వాత మిల్లులో దుంగల మీద కూర్చోని పొల్ని బట్టీ పెట్టేవాణ్ణి. అక్కడక్కడ అక్క తచ్చాడుతూ వుండేది.

అక్కనేదో పురుగు కరిచి దుంగల్లోనికి పారి పోయిందో రోజు! పెద్దగా కేకేసి అక్కడ నిలువునా కూలి పోయిందానాడు. మాట్లాడదు. మెలికలు తిరిగి పోతోంది. కరిచింది ఏమిటన్నదీ అంతు చిక్కలేదు. పాము కాటేసిందేమోనని అంతా భయపడ్డాం. కాసే పటికి తేరుకుని అక్క కాదన్నది. ఆ పురుగు కంది రీగలా వున్నదన్నది. తనని కరిచి దుంగ పగులులోనికి జారిపోయిందన్నది. కసిరేగి పగులులో కళ్ళుంచి తీక్ష ణంగా చూశాన్నేను. ఏదీ కన్పించలేదు. పగులులో వేళ్ళు జొనిపి, దుంగంబడి నడిచాను. పురుగు దొరికితే పిసికి పారేద్దామన్నంత కక్ష రేగింది.

నోటు పుస్తకాల్లేక నోట్సు రాసుకునేవాణ్ణి కాదు. ఫలితంగా మేష్టారితో చింత బరికెతో దెబ్బలు తినాల్సి వచ్చేది. రక్తం చిప్పిల్లిన చేతుల్ని ఉమ్ము తడిజేసుకుని వూరుకునేవాణ్ణి తప్ప ఆ ఊసెవరికీ తెలియనిచ్చేవాణ్ణి కాదు. అయితే నాన్నకీ సంగతి తెలిసింది. తెలిసి యజమాని ఇచ్చే యాభయి రూపాయిల కోసం కుడిచేతి చూపుడు వేలుని పోగొట్టుకున్నాడు. రంపానికి ఆ వేలుని అంకితం చేశాడు.



ప్రముఖ కథా రచయిత శ్రీ మధురాంతకం రాజారాం నుంచీ, రంజని-నందివాడ భీమారావు అవార్డు అందుకుంటున్న శ్రీ జగన్నాథశర్మ

దుంగల మీది పుట్టగొడుగుల్ని తొలగిస్తో కూర్చొన్న నా దగ్గరగా వచ్చి చేతిలో పది నోటు నుంచాడు. "వెళ్ళి పుస్తకాలు కొనుక్కో" అన్నాడు.

ఆ రాత్రి "ఎంత పని చేశావయ్యా" అని తాగొచ్చిన నాన్నని అమ్మ నిలదీస్తే -

"నా కోసం నేనీ పని చేయలేదే! నన్ను నమ్ము" అన్నాడు.

"చదువుకుని వాణ్ణయినా బాగుపడనీ" అన్నాడు. నన్ను కాటసీను పద్యాల్ని విన్పించమన్నాడు. ఎన్నడూ లేనిది, ఆనాడెందుకో ఆ పద్యాల్ని రాగయుక్తంగా నాన్నకి విన్పించాలనిపించింది.

ఏమరపాటునున్న అక్కను గిల్లి, పురుగని అల్లరి చేసినా దొరికితే కాటసీను పద్యాల్ని విన్పించమంటాడని పెరట్లో చెట్ల మీదా, గుబురుల వెనుకా దాగి నాన్నతో దోబూచులాడినా, అదంతా నాకు నాటకీయంగానే వుండేది. సహజమనిపించేది కాదు.

అమ్మ దగ్గు విషాదం! నాన్న త్యాగం విషాదం! అక్క చితుకు లేరుకోడం విషాదం! విషాదాల్లో సరదాలాడడం కృత్రిమం గాక మరేమిటి?

పదో తరగతి పాసయ్యాను. నన్ను చూసి నా వాళ్ళంతా సంబరపడ్డారు. మిల్లు యజమాని దగ్గరకు తీసుకు వెళ్ళి నేను పదో తరగతి పాసయ్యానన్నది చెప్పాడు. "పై చదువులు చదివిస్తావా" అని అడిగిన యజమానితో -

"ఈ చదువుకే రెక్కలు ముక్కలయ్యాయి" అన న్నాడు నాన్న.

"చదివిన చదువు చాలు! దయతలచి తమరు చిన్న నౌకరీ కల్పించండి. వాడి పొట్టకి వాడు సంపాదించు కుంటే అదే పది వేలు" అన్నది అమ్మ. కాదనలేదు యజమాని. కర్రల కొలతలు చూసే పని నాకప్ప గించాడు. నెలకి యాభయి రూపాయిలు జీతమని చెప్పాడు.

అయితే ఆ మిల్లులో నౌకరీ నాకిష్టం లేకపోయింది. రాకాసి లోయలో నేను జీవించలేననిపించింది.

దగ్గు రూపేణా అమ్మను అణగారుస్తోన్న జబ్బు, అక్కని కాటేసిన విషప్పురుగు, నాన్న వేళ్ళని కొరికేస్తోన్న కోరల కత్తి - అన్నీ ఆ మిల్లు యజమానని నాకు తెలిసీ తెలియడంతో ఒక్క క్షణం కూడా అక్కడ నిలువలేనని పించింది. వాడికి దూరంగా పారిపోవాలనుకున్నాను. పరుగెత్తాను.

జట్కావాలా నౌకతన్ని ఆదరవు చేసుకుని నాన్నతో తెగ తెంపులు చేసుకుని వున్న అత్తమ్మ ఊరికి పయన మయ్యాను. కన్నవాళ్ళకి, పుట్టి పెరిగిన ఊరుకీ దూర మయ్యాను.

"ఆపావు" అన్నది. సైకిలు నేర్చుకుంటోన్న అమ్మాయి. ఆ పిల్ల ఇల్లు దగ్గర పడింది. కళ్ళాన్ని బిగించనవసరం లేకపోయింది. గుర్రం ఆగిపోయింది. ఓణీని నిండుగా కప్పుకుని, ఆ అమ్మాయి కిందికి దూకడంతో నేల మీది నీరు పైకి చిమ్మింది. లాంతరు వెలుగులో నీటి చుక్కలు ముత్యాల్లా మెరిశాయి.





"పండక్కి అల్లుడ్ని తీసుకురావడమెందుకే?" బుర్ర గోక్కుంటూ అన్నాడు గుర్నాధం.

"పిండి వంటలన్నీ మీరొక్కరే చేస్తారేమిటే, ఖర్మ?" విసుక్కుంది ఆండాళ్ళు.

—కె. జనార్దన్

## ఒంటిచేతి విలుకాడు



అమెరికాకి చెందిన 38 ఏళ్ళ కెరోల్ వాకర్ గొప్ప విలుకాడు. అమెరికాలో నిర్వహించిన పోటీలో ఇతను వాల్గో స్థానాన్ని సంపాదించుకున్నాడు.

అయితే ఇతనికి కుడిచేయి లేకపోవడం విశేషం. 1978లో సామాను సర్దుతుండగా అతని కుడిచెయ్యి హైవోల్టేజ్ లైన్‌కి తగిలి షాక్‌వల్ల కాలిపోయింది. భుజం నించి చేతిని తొలగించవలసి వచ్చింది. ఆ సంవత్సరమే అతను విలు విద్య నేర్చుకునే కోర్సులో చేరాడు. చేయి పోయినా నిరుత్సాహపడకుండా కెరోల్ వాకర్ ఒంటి చేత్తోనే బాణం వేయడం సాధన చేయసాగాడు. ఆరు నెలలు సాధన తర్వాత పళ్ళతో బాణాన్ని సంధించడం అలవడ్డది.


6 అడుగుల 4 అంగుళాల పొడవున్న వాకర్‌కి విలు విద్యా ప్రదర్శన పోటీల్లో చాలా బహుమతులొచ్చాయి. పొలంలో పనిచేసే వాకర్ ఒంటి చేత్తో ట్రాక్టర్ కూడా నడపగలడు.

— యం.శారద

జట్కా కదలనుందో లేదో, పరుగులాంటి నడకతో ఓ వ్యక్తి ఎదురొచ్చాడు. అతను నిక్కరు, లాల్చీలో వున్నాడు. పూర్తిగా తడిసి ముద్దయి వున్నాడు. యాభయ్యేళ్ళ వయసుంటుందతనికి. ఫలానా చోటుకని చెప్పి జట్కాను ఎక్కబోయాడు. చేతినందించి, అతన్ని మీదికి లాక్కున్నాను. మేస్త్రమ్మ పక్కన చతికిలబడి స్థిరంగా కూర్చున్నానని నిర్ధారించుకున్న తర్వాతగాని అతను నా చేతి ఆసరాను వీడలేదు. అప్పుడతని చేతి వేళ్ళ వైపు చూశాను. చూసి పొంగిపోయాను. అతని కుడిచేతికి బొటనవేలు లేదు. ఈ వయసులో ఈ దుస్తుల్లో నాన్న అచ్చం ఇలానే వుంటాడనిపించింది. నాన్నే నా ప్రక్కన జట్కాలో కొలువు దీరాడనిపించింది. ఆనందం కలిగింది. నాకు మరింత సమీపంగా అతన్ని ముందుకి రమ్మన్నాను. జరిగొచ్చాడను. కల్లు వాసన వేశాడు. సంబరపడ్డాను.

జడివాన జలతారు తీవెలనిపించింది. చలిగాలి న్మలి వెచ్చననిపించింది. అసహనం, అసహ్యాలూ గుండెల్లోంచి ఎగిరిపోయి, హాయి హాయనిపించింది. జట్కాలోని వారినంతా తిరునాళ్ళకి తీసుకుపోతున్నట్టుగా వుంది. చేరువున నాన్న వున్నాడన్న భావన చెప్పలేని అనుభూతి అన్పించింది. చర్నాకోలాను ఝుళిపించాను. గుర్రం పరుగు శరవేగమయింది.

నాన్నలాంటి వ్యక్తిని, ఏ వివరాలూ అడగదలచలేదు. వివరాలు తెలుసుకుని ఆయన నాన్న కాదన్న నిజాన్ని అంగీకరించదలచలేదు. చలికి వణకుతూన్న అతని



"ఈ డ్రస్ వేసుకుంటే మీరు పదేళ్ళ చిన్నవాడిలా కనిపిస్తారు సార్" చెప్పాడు సేల్స్‌మెన్ ఓ పెద్దమనిషితో.

"అయితే ఇది నాకొద్దు. నాకు డ్రస్ విప్పినప్పుడు పదేళ్ళ చిన్నవాడిలా కనిపించేది కావాలి" చెప్పాడా పెద్దమనిషి. — గొల్లపూడి శైలజ

చుట్టూ చేతులుంచి హుషారయ్యాను.

ఇప్పుడెందుకో మేస్త్రమ్మకు నమస్కరించాలని వుంది. కాలేజీ కుర్రాణ్ణి అనునయించాలని వుంది. గురుమూర్తి నిండు నూరేళ్ళూ బతకాలని వుంది. పోలీసు మీద పగలేదు. శెట్టిని హత్య చేయాలనీ లేదు. మేస్త్రమ్మను ఆట పట్టిస్తూ శెట్టి మాట్లాడితే బాగుణ్ణని వుంది. పోలీసు పగలబడి నవ్వితే కలిసి నవ్వాలని వుంది. అణువణువూ అందంగా, ఆనందంగా వుందనిపించింది. ఈలవేసి పాట పాడాలనిపించింది.

గొంతెత్తాను! బతుకంతా పాటగా సాగిపోయింది!

ఎవరిళ్ళ దగ్గర వారు దిగిపోయారు. నాన్నలాంటి వ్యక్తి కూడా నన్ను విడిచి దిగి వెళ్ళిపోయాడు. దిగి వెళ్ళిపోతూ అతను కిరాయిగా రూపాయి నోటును నా కందివ్వనుంటే "వద్దు నాన్నా" అన్నాను. నవ్వి జోగుతూ వెళ్ళిపోయాడతను. నన్ను దీవించినట్టుగా చేతినెత్తి గాలిలో ఊపాడు. ఆలోచింపజేశాడు.

గడిచిన పదేళ్ళలో ఏదో ఓ అవసరాని గ్గాను చేతుల కున్న పదివేళ్ళనీ నాన్న పోగొట్టుకుని వుంటాడు. మొండి చేతుల్తో దుంగల్ని నెడుతూ అమ్మో, అక్కో తినిపించగలిగితేనే అన్నం ముద్దని నోటికి అందుకోగలుగుతూ వుండి వుంటాడు. దగ్గు జబ్బుతో అమ్మ శల్యమయి వుంటుంది. పాట్టు బస్తాలో తనని తానే కుక్కుకోగలిగే స్థితికి చేరుకుని వుంటుంది. అక్కను ఏ తేళ్ళు కుట్టాయో! ఏ పాములు కరిచాయో! ఏ పేళ్ళలో ప్రాణాల్ని బలి పెడుతుందో ఏమో!

నా వాళ్ళంతా ఎలా వున్నారో! ఏమయి వున్నారో!

ఏ దృశ్యాలకు భయపడి, ఏ జీవితాల్ని అసహ్యించుకుని ఎవరికి దూరంగా పారిపోదలచానో, అది నాకు సాధ్యం కాలేదు. ఎల్లెడలా ఒకటే దృశ్యం! ఒకటే జీవితం! రాకాసిలోయ అంతటా వ్యాపించి వుంది. క్రూర మృగాలు, మారణాయుధాలు, మంత్ర తంత్రాలన్నీ నాలాంటి కుటుంబీకుల కోసమే పొంచి వున్నాయనిపించింది.

నా వాళ్ళను నేను రక్షించుకోవాలి! అందుకు సన్నద్ధం కావాలనుకున్నాను. కొరడాను విసిరి, జట్కాను మా ఊరి వైపు పరుగుదీయించాను. ఈ దీర్ఘ రాత్రిలో, మైళ్ళ దూరంలో నున్న మా ఇంటికి ఈ జట్కాలో నేను చేరుకోగలనో లేదో! కాని, చేరుకోవాలన్న దృఢ సంకల్పం నాలో వుంది!! ●